లక్ష్మి

మొక్కపాటి నరసింహశాస్త్రి గారు

"లక్ష్మీ, మనరోజు లీలా వెళ్ళిపోవలసినదేనా! ఇంతకాలమునుంచి సజీవమై చిగిరించుచున్న ఆశాలతను తెంపవలసినదేనా? లేక నిర్మూలముకూడా చెయ్యాలా?"

ఈప్రశ్నకు వచ్చే సమాధానముపైన తనజీవితమంతా ఆధారపడి ఉన్నట్టు, యవనికవలె నున్న అశ్రుబిందువుల చాటునుండి ప్రేమరస ముట్టిపడు చూపులతో, అతిత్వరితముగా వస్తున్న వేడినిట్టూర్పుచేత కదలుచున్న నాసికాపుటములతో, చలిస్తోన్న అధరముతో; ప్రాణము అరచేత పెట్టుకుని, లక్ష్మి పెదవులవైపు తదేకదీక్షగా చూస్తూ ప్రకాశరావు అత్యాతురతతో కనిపెట్టుకున్నాడు.

ప్రకాశరావు ఇప్పటికి సుమారు పాతిక సంవత్సరముల వాడు. అతని జన్మస్థలం కాకినాడ. బ్రాహ్మణవంశమునందు పుట్టినవాడు. తలిదండ్రులు మంచి సదాచారసంపన్నులు; వైదికసంపత్తి కలవారు. తమకున్న స్వల్పాస్తిలోనే ఎవరికేనా అడిగినవాళ్లకు పెట్టడమే కాని దేహి అని చెయిచాచి ఇంకొకరిని యాచించకుండా నప్రతిగ్రహీతలని వాడుక పొంది కాలక్షేపము చేస్తూ ఉండేవారు. ఈనాటి సామాన్య కుటుంబీకులవలె అనవసరముగా కోర్టులచుట్టూ రిజిష్ట్రారాఫీసులచుట్టూ తిరగడమూ ఓపాత్యాలూ నంపన్నాలూ ఏమీ లేకుండా, చాలా మర్యాదస్థులు, ఘరానా మనుష్యులని పేరుపొందారు. ఒకళ్ల జోలీ సౌఖ్యము అవసరములేదు. పరులనుచూచి అసహనంలేదు. ఎదటివాళ్లు కష్టంలోఉన్నారూ అంటే, తమూ చాలా కష్టాలు అనుభవించి ఉండడముచేత, వాళ్లకంటెఎక్కువగా తమరూ విచారిస్తూ, మరొకసహాయ మేమీ చేయలేకపోయినా, ధైర్యంకలిగించే జాలిమాటలతో ఎదటివాళ్లు తమకష్టాలు సగము మరిచిపోయేటట్టు చేస్తూ, అందరికీ స్నేహపాత్రులై పదిమందిచేతా "ఓహో" అనిపించుకుంటూ ఉండేవారు.

వారికి చాలామంది పుట్టిపోయిన తరవాత ఇద్దరుకొడుకులూ నలుగురుకూతుళ్ళూ మిగిలారు. పెద్దకొడుకు బి. ఏ. ప్యాసయి పిఠాపురంరాజావారి కాలేజీలో అరవయి రూపాయిలజీతంమీద మేష్టరుగా ఉండేవాడు. తరవాత నలుగురుకూతుళ్ళూ కాపరానికి వెళ్లకముందే [illegible] ఇల్లు పట్టారు. కడసారపువాడు ప్రకాశరావు.

ప్రకాశరావు తల్లిపోలిక. అందుచేత చాలా అదృష్టవంతుడని చిన్నప్పటినుంచీ అంతా అంటూఉండేవారు. మెరుగుచామన చాయ శరీరకాంతి, దీర్ఘముగాక అలాఅని మరీకురుచగాక ఇంచుక స్థూలమై బలిష్ఠమైన అవయవసౌభాగ్యము; కొంచెము లోతైనను ప్రకాశవంతములై విశాలములైన నల్లనినేత్రయుగము; దృఢసంకల్పమును తెలియజేయు గడ్డము, మిక్కిలి జాలియు స్త్రీవిషయమున మార్దవమును సూచించు నిండైన ఎర్రనిపెదవులు గలిగి, చక్కనివాడై, ఒకసారి చూచిన వారికి తిరిగి చూడవలెనను ఆశగొలుపుచు, స్నేహపాత్రుడని అందరిచేతా అనిపించుకుంటూ ఉండేవాడు. తలిదండ్రులవలెనే సున్నితమైన వెన్నవంటి మనసుగలవాడు. భూతదయ సర్వసమత్వము గలవాడు. ఏమాట మాట్లాడితే ఎదుటిమనసు నొచ్చునో అను భీతితో బహుజాగ్రత్తతో సంచరిస్తూ ఉండేవాడు. సహజమైన సౌమ్య స్వభావమునకు తోడు, ఇంట్లో తనతోబుట్టువుల కష్టము చూచి, నిర్ధనుల దైన్యముచూచి ప్రపంచమంతా కష్టమయమై ఉండడము చూచి, ఎప్పుడూ విచారంగాఉంటూ, కష్టములో ఉన్నవారిని చూచినప్పుడు తనకు చేతనైన సహాయము చేస్తూ ఉండేవాడు. ఇతనిస్వభావము గ్రహించలేని వాళ్లు ఇతను చాలా మితభాషి అందుచేత గర్విష్ఠి అనుకునేవాళ్లు. పైవాళ్లదాకా ఎందుకు ఇంట్లోవాళ్ళే ఇతనిసంగతి తెలుసుకోలేక ఒట్టివెర్రివా డనుకునేవారు. తన మనస్సు తను ఇతరులకు విప్పిచెప్పకోడానికి మొహమాటపడి తమంతట తము తెలుసుకునే వాళ్ళెవళ్ళూలేక, కష్టసుఖములు చెప్పుకోడానికి తనమనసులో కలిశేస్నేహితు లెవ్వరేనా ఉంటే బాగుండునని ఎప్పుడూ విచారిస్తూ, ఇంత ప్రపంచములోనూ ఏకాకియై ఉండేవాడు. చిన్నప్పటినుంచి ఏఆటలూ పాటలూ ఎరగడు. ఎప్పుడూ స్కూలికెళ్లడమూ, చదువుకోడము, శలవులలో ఏమేనత్తగారింటికో మేనమామగారింటికో వెళ్ళి పదిహేను రోజులో, ఇరవైరోజులో అక్కడుండి మళ్లీ ఇంటికొస్తూ ఉండడం అలవాటయింది.

౨

రాజోల్లో ప్రకాశరావుకి ఒకవేలువిడిచిన మేనమామగారు ఉండేవారు. భమిడిపాటి రామచంద్ర శాస్త్రులుగారని సంపన్నగృహస్థులు పదిమందికలవారు. ఆగ్రామంలో ఉండే బ్రాహ్మణ్యం అందర్లోకి వంశమర్యాదచేత నైతేనేమి ధనధాన్యసమృద్ధిచేత నైతేనేమి, రామచంద్రయ్యగారే పెద్ద. సాలుకి పదివేల రూపాయలు భూములవల్ల ఆదాయం. సుమారు ఒక్కలకారానికి వడ్డీవ్యాపారం. ఇంటినిండా ఇంటిపిల్లలు. తాలూకా తాలూకా అంతా కూడా గొప్పపలుకుబడి. చూడ ముచ్చటగా ఉండేది వారిఇల్లు.

ప్రకాశరావు ప్రతిశలవులలోను తప్పకుండా వారింటికి వెడుతూఉండేవాడు. నిస్సారము, సంతోషవిహీనము అయిన ఇతని జీవితంలో రాజోలుప్రయాణం మట్టుకు అతనికి ఎప్పుడూ సంతోషం కలిగిస్తూ ఉండేది. ఎక్కడచూచినా చక్కనితోటలు ఊరినిచేరి మంచి

నీళ్ల కాలవ, దానిపక్కనే గోదావరి; వీటన్నిటి తోను రాజోలుచాలా అందంగాను వాస యోగ్యంగాను ఉండేది. నీళ్లుచూస్తే ప్రకాశ రావుకి అమిత ఆనందం. ఎక్కడేనా కాలవున్నా చెరువున్నా గట్టున కూచుని గంటలతరబడి నీళ్ల కేసి చూస్తూ ఉండేవాడు. అందులో అత నికి భావనానుకూలమైన బొమ్మలు కనబడు తూ ఉండేవి.

రాజోలు తప్పకుండా నచ్చి ఉండడానికి ప్రబలకారణం, ఇక్కడి కాలవా గోదావరీ ఉండడం ఒకటి. ఇదొక్కటే కాదు. ఇంతకంటె ముఖ్యమైనది ఇంకోటుంది. రామచంద్రయ్య గారికి నలుగురు కొడుకులు ఇద్దరు కూతుళ్లూను. ఆ ఆడపిల్లలిద్దరిలోనూ పెద్ద లక్ష్మీదేవి. ప్రకా శంకంటె సుమారు రెండేళ్లు పెద్ద. పిల్లకి నిజంగా సార్థకనామం. సువర్ణచ్ఛాయ, చెంపకు చేరువ కళ్లు, కోటేరేసినట్లు ముక్కు, ముద్దులుగారే నోరు, విశాలమైన నుదురు, బారెడు జడ, ముద్దులొలికే గడ్డం, దానిపైన చిన్నపుట్టు మచ్చ, నవ్వితే బుగ్గలికి సొట్టలు. ఇట్టి బాహ్య స్వరూపానికి తోడు అంతరంగిక స్వభావం కూడా అట్టిదే. వెన్నవలె కరగు మనసు, ప్రేమ పూరితమైన హృదయం.

ఇంక కావలసిన దేమిటి. అయస్కాంత శిల ఇనుముని ఆకర్షించేటట్లు, ప్రకాశరావుని ఆకర్షించేది లక్ష్మీదేవి. చిన్నప్పటినుంచి ప్రకా శరావుకి లక్ష్మినిచూస్తే ఎంతో ఆనందంగా ఉండేది. కారణమిదని కాని ఆనందంయొక్క స్వభావ మిదనికాని మాత్రం చెప్పడానికి వీలు లేదు. చంద్రబింబం కనబడడముతోనే కలు వలు వికసించినట్లు లక్ష్మినిచూడడం తోటే అతని కళ్లల్లో ఒకవిధ తేజస్సు సంతోషం కనుపించేది. కారణపరీక్ష అతనెప్పుడూ చెయ్య లేదు. కారణంఏమిటి లోపలినుంచి ఏదో పాల పొంగులా వచ్చేది సంతోషం. వసంతం రావ డం తోటే కోకిల ఎందుకు పాడాలి, పుష్ప ములుచూడడం తోటే మధుపం ఎందుకు ఝంకారించాలి, సూర్యదర్శనం కావడం తోటే పద్మం ఎందుకు వికసించాలి కారణం ఉండీ ఉండకపోవచ్చును. ఇవన్నీ మట్టుకు కారణ పరీక్ష చెయ్యకుండానే ఈవికారములను పొందు తూ ఉంటాయి. అలాగే ప్రకాశంకూడాను. రా జోలు రావడముతోనే ఒక్కసారి తనకష్టా లన్నీ మరిచిపోయేవాడు. నూతన జన్మ ఎత్తి నట్టుగా ఉండేవాడు. వికసించిన పూల నవ్వారినో చూసినట్లు ఉండేది అతనికి, ఈ చిన్నపిల్లని చూడడంతోనే. పోనీ తనకష్టసుఖము లేమైనా చెప్పుకునేవాడేమో అంటే అదీలేదు. ఆపిల్లనిచూడడంతోనే చిన్నపిల్లవాడై పోయే వాడు. ఇంటిదగ్గర ఉన్నంతకాలం వయసున పసిబాలుడైనా, మనసులో ముదుసలిలా ఉండేవాడు. ఇక్కడకొస్తేనో ఆపిల్ల మాట్లా డితే చాలు, నవ్వితేచాలు, చూస్తేచాలు, సంతోషం ఊరికే సంతోషం. సంతోషంతోపాటు ఇంకొకటి ఉండేదిక్కడ—శలవులాఖర్లు ఇక్క డనుంచి వెళ్ళే సమయంవచ్చిందీ అంటే మళ్లీ గుండె చెరువైపోయేది. మహాకష్టం ఏదో అను భవించబోయేవాడులా ఉండేవాడు.

3

లక్ష్మితోడబుట్టిన 'వాళ్ళూ' మేనత్తకొ డుకూ నర్సాపురంలో చదువుకుంటూ ఉండే

వాళ్లు. వారిసంరక్షణకోసం లక్ష్మిమేనత్త వితంతు వాళ్లదగ్గరుండేది. మేనత్తదగ్గర చనువు గనుక లక్ష్మికూడా తరుచు నర్సాపురంలోనే ఉండి ఆడపిల్లల స్కూల్లో చదువుకుంటూ ఉండేది.

ప్రకాశరావు ఎప్పుడూ శెలవు లివ్వగానే ముందు నర్సాపురం వచ్చి అక్కడ నాలుగు రోజులు ఉండేవాడు. అక్కడనుంచి అంతా కలిసి రాజోలు స్టీమర్లోనో పడవలోనో వచ్చేవాళ్లు. ఇంటిదగ్గరనుంచి తెచ్చిన మినపరొట్టో దోసలో కొనుక్కున్న పకోడీలో కారాబూందో వాళ్లిద్దరూ ఓమూలకూచుని తింటూ, మధ్యమధ్య కాస్త గోదావర్లో వేస్తూ, అవి తినడంకోసం వచ్చిన చేపల్ని చూస్తూ ఎప్పుడూ ఇద్దరూ ఇలా పడవమీద వెళ్లడంగా బాగుండు ననుకుంటూ "పడవదరి చేరింది దిగండి" నేటప్పటికి, పడవనీ, పడవవాళ్లని, దిగమన్న వాళ్లని, తమసుఖాన్ని, తమన్ని సృష్టించిన బ్రహ్మదేవుణ్ణి, తిడుతూ త్వరగా దిగమని తొందరపెడుతూ ఉన్నవాళ్లమీద విసుక్కుంటూ, దిగలేక దిగలేక దిగి, చూపుమేర వరకూ తిరిగి తిరిగి పడవకేసి చూస్తూ, ఆఖరికి బాష్పపూరితమైన ఒక్క నిట్టూర్పు విడిచి మౌనము వహించి ఇంటికి చేరేవారు. ఇంటికి చేరడంతోనే, బాలుర సహజస్వభావంతో పడవసంగతంతా మరిచిపోయి ఆటలు ఘోరంగా పడేవారు. తెల్లవారుఝామున నాలుగ్గంటలకే లేచి ముందు ఎవరికి మెలుకువ వస్తే వారు రెండోవార్ని లేపి, పెద్దనవ్వు నవ్వుతూ అర్థం లేని మాటలెన్నో చెప్పుకునేవారు. తరువాత మొహాలు కడుక్కుని, తలలు దువ్వుకుని, నీళ్ళోసుకుని, లక్ష్మి మేనత్త కలిపెడుతోంటే, ఇద్దరూ ఒక్కకంచంలోనే ఆవకాయేసుకుని పెరుగోసుకుని చద్దన్నం తినేవాళ్లు. ఇంట్లో ఉండే పిల్లలంతా వీధుల్లోకెళ్లి ఇరుగుపొరుగు పిల్లలతోటి ఆడుకుంటూంటే, లక్ష్మి ప్రకాశం మట్టుకు ఓమూలకూచుని, ఆద్యంతాలు లేని కబుర్లు చెప్పుకునేవారు. ఇలా ప్రకాశరావు ఇక్కడుండే పదిహేనురోజులో నెలరోజులో వీళ్లిద్దరికీ ఒక్కక్షణంలా గడిచిపోయేది.

ఇంకో నాలుగురోజులకు ప్రకాశరావు వెళతాడనగానే ఇద్దరికీ అన్నహితవులు పోయేవి. ఇద్దరూ మూరెడుపొడుగు మొహాలు చేసుకుని మాటామంతీ లేకుండా కంఠపూర్తి గాయు, ప్రయాణమంతా ఇంతటితోటి ఆఖరవుతుందేమో అన్నట్టు, ఒహాళ్లకేసి ఒహాళ్లు చూస్తూ కూచునేవాళ్లు. ఇహాను బయల్దేరే రోజు చెప్పనే అక్కరలేదు. ఇద్దరూ ఒహాళ్లనొహాళ్లు కౌగిలించుకుని రాగాలెట్టడం; ప్రకాశం వెళ్ళడానికి వల్లకాదని కొంతసేపూ, తను కూడా కాకినాడ వెళతానని కొంతసేపూ, లక్ష్మి పట్టేది. ఎలాగయితేను వాళ్లని విడదీసి లక్ష్మికి లక్ష్మిప్రసన్నంచేసి, ప్రకాశం మళ్లీ కొద్దిరోజుల్లోనే వస్తాడని ధైర్యంచెప్పి, అతనికి దార్లోకి గాస్త చేసిచ్చి సాగనంపేవారు. ప్రకాశం ఇంటికి వెళ్లిన వారంరోజులవరకూ లక్ష్మి తిండితినక, ఏదో పరధ్యానంగానూ, బెంగగానూ, మతిపోయినట్లు తిరుగుతూఉండేది. కాకినాడలో ప్రకాశరావుకూడా అదేఅవస్థలో ఉండేవాడు.

౪

లక్ష్మీదేవికి మేనత్త ఒకావిడుండేది. ఆవిడ పేరూ నామకరణసమయమందు లక్ష్మీదేవమ్మనే తలిదండ్రులు పెట్టారు. కాని పూర్వాచారాన్నిబట్టి వ్యవహారికంలో అందరూ ఆవిడను లచ్చమ్మనేవారు. లచ్చమ్మను, తలిదండ్రులు చిన్నతనంలోనే పోవడం చేత తన దగ్గరే పెరుగుతోన్న తనమేనల్లుడికే ఇచ్చి వివాహంచేసి తనదగ్గరనే కూతుర్ని అల్లుణ్ణి అట్టేపెట్టుకున్నాడు. లచ్చమ్మగారికి కాపురమునకు వెళ్లిన చాలాకాలానికి లేకలేక ఒక్కకొడుకు పుట్టాడు. వెంకట్రామయ్య అనేవాడు. కొంచెము నలుపు; లోతైన కళ్లు; విశాలమైన నుదురు. కొంచెము పొడుగుమనిషి; అందవికారికాదుకాని ఎన్నికకెక్కినవాడూ కాడు. పాపం, చిన్నతనంలోనే తండ్రిపోయాడు. అయినా ఏలోటూ లేకుండా, తల్లి మేనమామలూ అతని చేతులలో పెట్టుకుని అతిగారాబంగా పెంచారు. వెంకట్రామయ్య చిన్నప్పటినుంచీ స్వతంత్రమంటే ఏమిటో ఎరుగడు. ఎప్పుడూ ఒకళ్ల మీద ఆధారపడి ఉండవలసినదే. ఏపని చేతనైనది కాదు. ఆఖరికి అన్నం కలుపుకుని తినడమేనా చేతనయ్యేది కాదు. అన్నిటికీ వాళ్లమ్మ ఏంచెపుతే అంత. వీధులలో కెళ్లేటప్పుడు ఏ బట్ట కట్టుకెళ్లాలో వాళ్లమ్మ చెప్పాలి. అన్నం తింటూంటే ఏమికలుపుకోవాలో అమ్మ చెప్పాలి. కట్టుకున్న బట్టమాసిపోతే చాకలిదానికి వెయ్యమని అమ్మచెప్పాలి. అలాఅని తెలివితేటలకేమీ లోటూలేదు. చదువులో మంచి తెలివితేటలే ఉండేవి.

ఇతను లక్ష్మికంటె సుమారు పదిహేన్నేళ్లు పెద్ద అయినా ఇదో పెద్దతేడా కాదనీ, మేనరికం, అందులో ఒక్కడే మేనల్లుడుండగా పైకెళ్లడ మెందుకనీ, రెండోదాని కెలాగూ పైసంబంధము తప్పదు, పెద్దదేనా ఇంటిదగ్గ నుండి మేనత్తదగ్గర సుఖపడుతుందని ఆలోచించి, లక్ష్మికి పదోఏడు రాగానే వెంకట్రామయ్యకు ఇచ్చి పెళ్లిచేశారు.

పెళ్లికి ప్రకాశరావుకూడా వచ్చాడు. లక్ష్మికి ప్రకాశానికీకూడా పెళ్లంటే మేళాలూ, తాళాలూ, ఊరేగింపులూ, భోజనాలూ అనేకాని అంతకంటె వేరే ఏమీ తెలియదు. తనపెళ్లికి ప్రకాశంకూడా వచ్చాడని లక్ష్మి బ్రహ్మానందపడిపోయింది. తనస్నేహితురాలికి పెళ్లవుతోందిగదా అని, ప్రకాశం సంతోషానికి మేరలేదు. అన్నమాసం పెళ్లికూతురు పక్కనే కూర్చోడం, పెళ్లికూతురు కదిలితే కదలడం; నుంచుంటే నుంచోడం. తనకి మామూలుగా లక్ష్మికంచంలో అన్నంపెట్టడంలేదని మొట్టమొదట కొంచెం కోపమొచ్చేది ప్రకాశానికి. ప్రకాశంకూడా పల్లకీలో కూచుంటాననే వాడు కాని పిల్లకాదని లక్ష్మి పట్టుపడుతూండేది. సంబంధంకూడా కొత్తది కాకపోవడంవల్ల మామూలుకంటె, విశేషం బంధువులంతా రావడం, భోగంమేళం దానితోటీ ఈఅయిదురోజులూ ఎక్కువసరదాగా ఉందన్నమాటకాని అంతకంటె పెళ్లిని కొత్త ఏమీ లేకపోయింది.

పెళ్లి అయినతరవాత కూడా లక్ష్మి, ప్రకాశం, మామూలుగా ఒక కంచంలోనే భోంచేస్తూ ఒకమంచంమీదనే పడుకుంటూ

ఉండేవాళ్లు. ఏదేనా కోపమొస్తేమట్టుకు "నీ ఎంగిలితినన"ని లక్ష్మి వేరేకంచంలో భోంచేసేది. అప్పుడు ప్రకాశం కొంటెతనానికి ఏడూరగాయి ముక్కో లక్ష్మికంచంలో పడేస్తే ఉడుకుబోత్తనం వచ్చి రాగాలెడుతోండేది.

ఇలా కొంతకాలమయేసరికి లక్ష్మి పుష్పవతియై కాపరానికి వెళ్లింది. ప్రకాశం యథాప్రకారంగా వస్తూఉండేవాడు. కాని, మునుపటికిమల్లే, లక్ష్మి ఎందుచేత తనకంచంలో భోజనంచెయ్యడంలేదో, తనదగ్గర ఎందుకు పడుకోడం మానేశిందో మట్టుకు ప్రకాశాని కర్థం కాలేదు. పగలు మునుపట్లాగ కబుర్లూ కథలూ చెప్పుకోడానికి లక్ష్మికి ఇంట్లో ఏదో ఒకపని ఉండేది. రాత్రిళ్లు మొగాళ్ల భోజనాలైన తరవాత ఆడవాళ్లతోటి భోంచేస్తూఉండేది లక్ష్మి. ఈలోపున ప్రకాశం ఏచాపమీదనో పడుకుని నిద్రపోయేవాడు. తెల్లవారుఝామున మెళుకువ వచ్చినప్పుడు మామూలుగా లక్ష్మిని లేపుదామంటే, ఎక్కడ పడుకునేదో కనపడేది కాదు. "నువ్వెక్కడ పడుకుంటున్నా"వని రెండు మూడుసార్లు అడుగుతే, బుగ్గ నొప్పోటుపొడిచి నవ్వుతూ పరుగెత్తుకు పోయేది. ఈమాత్రం తనడుగుతే చెప్పకూడదా అని ఉడుకుమోత్తనం వచ్చి, "మీకోడలెక్కడ పడుకుంటోంద"ని లక్ష్మి అత్తగార్నే అడిగాడు. ఆవిడ పక్కున నవ్వి, "ఎంత వెర్రివాడవోయి; ఎక్కడ పడుకుంటుంది; మొగుడుదగ్గిర దక్షిణపుగదిలో తలుపు బిడాయించుకొని గువ్వలా పడుకుంటుంది" అంది. అదేమిటి! మొగుడుదగ్గర పడుకోడమేమి టనుకున్నాడు. పోనీ పడుకుంటే మట్టుకు, తెల్లవారకట్ల తను లేపడానికి వీలు లేకుండా తలుపుబిగించుకోడ మెందు కనుకున్నాడు. ఎవర్నేనా అడుగుతే నవ్వుతారేమో అని భయపడి ఊరుకున్నాడు. ఏమనుకుంటే ఏమిలాభం. ప్రకాశానికి ఇవన్నీ చూస్తే వెనుకటి ఉత్సాహం తగ్గింది. ఎలాగో ఎందుచేతనో లక్ష్మి తనకి దూరమైపోయిందని తెలుసుకున్నాడు. ఈసౌఖ్యమేనా లేకుండా చెయ్యాలా దేవుడని విచారించాడు.

చద్దన్నముమాత్రం ఇతను తినేటప్పుడే తినేదిలక్ష్మి. ప్రకాశానికి రోజూ స్నానానికి నీళ్లి తోడిచ్చేది. అతని లాగూ చొక్కా ఉతికి ఆరేస్తోండేది. మధ్యాహ్నం తలదువ్వి జడో ముచ్చటముడో వేస్తోండేది.

*

ఇలాగు కొన్ని సంవత్సరములు సామాన్యంగా జరిగిపోయినాయి. ఒకశుభవారమునాడు, లక్ష్మి చెల్లెలు రవణమ్మకు పెళ్లయింది. రాజమహేంద్రవరమునుంచి పెళ్లివారు తర్లి వచ్చారు. పెళ్లి రెండోనాడు సాయంత్రం ఒక మూల కూచుని లక్ష్మి ఎక్కెక్కి రాగాలెట్టడం మొదలెట్టింది. కారణమేమిటో ప్రకాశానికే గోచరించలేదు. బోగంమేళం, బ్యాండుమేళం తోటి మహావైభవంగా పెళ్లవుతోంటే ఇలా ఎందుకు విచారించా లనుకున్నాడు. తేలుగీలేమన్నా కుట్టిందా అనుకున్నాడు. ఎన్ని విధాల తెలుసుకోవలెనని ప్రయత్నంచేశినా, లక్ష్మి, తనచెయ్యి పట్టుకుని మరింత రాగాలెట్టడమేకాని కారణం చెప్పలేదు. కారణం తెలియకపోయినా తన స్నేహితురా లంత

విచారిస్తోంది కదా అని తనకీ కళ్లమ్మట నీళ్లు వచ్చాయి. తనూ ఓగదిలో కూచుని కళ్లమ్మట నీళ్లు కారుస్తూ లక్ష్మి విచారానికి కారణమేమై ఉంటుందా అని ఆలోచించాడు. చెల్లెలత్త వారింటికి వెడుతోందని విచారిస్తోందేమో ననుకున్నాడు. అంతకంటె ప్రబలమైన కారణమేమీ తోచలేదు. సరే ఇందుకేకదా అనుకుని లక్ష్మిదగ్గరకు వెళ్లి పరామర్శించడము మొదలుపెట్టాడు. "నాకు తెలిశిందిలే కారణమ"న్నాడు. "సరదాగా దానికి పెళ్లి అవుతోంటే, నీకు విచారమెందుక"న్నాడు. "పెళ్లాడి నువ్వేం కష్టపడుతోన్నావ"న్నాడు. ఈ వింతపరామర్శ విని, బిక్కమొహంతో, ఏడుపుమాని, చిరునవ్వు నవ్వి, "చాల్లేవోయి నీకభుర్లూ నువ్వూను, ఎప్పుడూ ఒకలాగే ఉన్నావు" అని చక్కాపోయింది. ఎప్పుడూ ఒకలాగే ఉండడమేమిటా అనుకున్నాడు, పాపం, ప్రకాశం.

పెళ్లి నాలుగోరోజున ప్రకాశానికి ఎందుచేతనో ఏమితోచిందికాదు. ఏదో పిచ్చెత్తినట్టుంది. తనారోజున లక్ష్మిని పరామర్శించింది మొదలు, మళ్లీ లక్ష్మితనకు కనపడలేదు. సాయంకాలం హఠాత్తుగా ఒకసారి కనుపించింది. కనపడగానే పిల్చి, ఓగదిలోకి తీసుకెళ్లి, కూచోమన్నాడు. 'ఎందుకో చెప్పు', నాకు పనుందంది. "పోన్లే నీకంత తొందరపనుండి నాతోటి మాట్లాడడం ఇష్టంలేకపోతే వెళ్లవచ్చున"న్నాడు. "అబ్బ, అదికాదోయి! నిజంగానే పనుంది. అదికాకుండా ఎవళ్లేనా వస్తే బాగుండద"ంది లక్ష్మి. "బాగుండక పోవడానికిందులో నాకేం తప్పు కనపడడంలేదు. నాకు ప్రపంచకంలో స్నేహితు లెవ్వరూలేరు నువ్వు తప్ప. నీకోసంగదా నేనిక్కడికొస్తోంట. మునుపటికి మల్లే మాట్లాడడంమానేశావు. పోనీ కనపడనేనా కనపడకూడదా? నువ్వుకూడా ఇంతదూరమై పోతోంటే నాబ్రతుకెలాగ. నేనిక్కడికి రావడంకూడా నీకు కష్టంగా ఉందేమో చెప్పు దాచక. నీకెలా ఇష్టమైతే అలాగే చేస్తాను. నాజీవితమంతా ఇలా కష్టాలతో వెళ్లనలసిందేను. పాపం, నిన్నుకూడా నిష్కారణం కష్టపెట్టడం నాకిష్టంలేదు. నువ్వు రావద్దంటే మానేస్తాను. నేనేమీ అనుకోన్లే, ఉన్న సంగతిచెప్పు" అన్నాడు ప్రకాశం.

అనేటప్పటికి లక్ష్మి నిశ్చేష్టురాలైంది. మొహం ఎర్రపడ్డది. కళ్లల్లో నీళ్లు కమ్మాయి, ఒళ్లు కొంచెం కంపించింది. ఒక్కక్షణం మాట్లాడ కూరుకుని, "ప్రకాశం, నీకు పదిహేనేళ్లు వచ్చినా వట్టి అజ్ఞానుడవు. నువ్వు ఇలా అనకూడదు. నువ్వు రావడం నా కిష్టంలేకకాదు. ఏదోపని తొందరమీద ఉండడము చేత కనబడలేదు కాని, అంతకంటె మరేమీ కాదు. నువ్వు రాకపోతే నాకు చాలాకష్టంగా ఉంటుంది; మునుపటికిమల్లేనే నీతోటి మాట్లాడుతూ కూచోవాలని ఉంటుంది; కాని ఇప్పుడలా వీలులేదు. నువ్వు ఎప్పుడువస్తావనీ ఎప్పుడు కళ్లబడతావనీ మునుపటికి మల్లేనే కనుపెట్టుకుంటున్నాను. నువ్వు వెడుతే మునుపటికిమల్లేను—అంతకంటె ఎక్కువగాను—బాధపడుతూ ఉంటాను. ఇలా అన్నానని మట్టుకు మళ్ళా ఎవ్వరి దగ్గరా అనకు," అని రెండు

కన్నీటిచుక్కలు రాల్చి, వంచిన తల ఎత్తకుండా గిరుక్కున తిరిగి చక్కాపోయింది. తన స్నేహితురాలికి తనమీద దయ పూర్తిగా తప్పలేదుకదా అని సంతోషించాడు ప్రకాశం; కాని, ఈతలవంపెందుకో, ఈకన్నీళ్లెందుకో మట్టుకు అర్థంకాలేదు. ఈరహస్యం కోరడమెందుకో తెలియలేదు. తమకు మిక్కిలిప్రీతి అయిన వస్తువును సాధారణంగా ఎవ్వరూ బహిరంగపరచరు. ఇప్పుడు జరిగిన సంగతి ప్రకాశం ఎవ్వళ్లతోటీ చెప్పదలచుకోలేదు. ఇదింకొకళ్లకి సంబంధించినదికాదు. కాని చెప్పవద్దని ప్రత్యేకం అనడానికి కారణమేమిటో మట్టుకు తెలియలేదు. "అయినా ఈరోజున లక్ష్మిమాటలు కొంత వింతగా ఉన్నాయి ఎందుచేతనా" అని ఆలోచిస్తూ గోదావరిగట్టు వెళ్లి కూచున్నాడు ప్రకాశం.

ఆరోజు చైత్రశుద్ధత్రయోదశి. వెన్నెల చక్కగా చల్లగా ఉంది. అప్పుడే పైకి వచ్చుచున్న తరుణచంద్రకిరణములు గోదావరిలో ప్రతిఫలిస్తున్నాయి. చల్లనిగాలి వేస్తోంది. చూపుమేరలో మనుష్యులెవ్వరూ లేరు. దూరాన్ని ఒక చిన్ననావ నెమ్మదిగా నీటిని చీల్చుకు వెడుతోంది. చిన్నతనపురోజులు జ్ఞాపకం వచ్చాయి. మనసులో ఒకవిధమైన సౌమ్యభావము కలిగి ఒళ్ళు ఒకసారి గరిపొడిచింది. గోదావరిలో చిన్నచిన్న అలలు బయలుదేరి, వెన్నెలలో మిలమిల్లాడుతూ సజీవమై ఉన్న ఒకపెద్ద పాములా ఉంది. చేపలు



జంటలుగా నీటిపైకి ఎగురుతూ పరుగెడుతోన్నాయి. ఆకాశముమీద రెండుపక్షులు దగ్గరగా ఎగురుతూ కూస్తూ గూటికి కాబోలు బహుతొందరగా వెడుతున్నాయి. దగ్గరలో రెండుకుక్కలు చెలగాటాలాడుతూ

ఒకదానిమెడఒకటికౌగలించుకుంటూతమనీడని పట్టుకోవలెనని ప్రయత్నం చేస్తూ ముద్దుగా గంతులేస్తోన్నాయి. వెనుక కాలవగట్టుమీద కాబోలు కూచుని పాడుచున్న పిల్లవాని పాట హాయిగా వాయుతరంగములమీద తన చెవిదగ్గరకు చేరుతోంది.

ఇదంతా చూస్తే ప్రకాశానికి మనసులో ఏదో వర్ణనాతీతములైన భావా లుదయించాయి. ఇదివరకు దుఃఖమయంగా ఉన్న ప్రపంచం ఇప్పుడు హఠాత్తుగా ప్రేమమయంగా కనుపించింది. వాయువులో వింత సౌరభం తోచింది. గోదావరీ తరంగాల్లో వింత గానం వినిపించింది. హృదయంలో నూత్న భావాలు సముద్రతరంగాల్లాగ బయలుదేరి ఏదోవింత ఆనందం కలుగచేస్తోన్నాయి. కాని దాని స్వభావమట్టు కింకా సరిగా తెలియడంలేదు.

తనూ లక్ష్మి చిన్నప్పటినుంచీ ఆడిన ఆటలు, పలికిన పలుకులు, ఇప్పుడు కొత్తగా స్ఫురించాయి. పాలపొంగులాగ హఠాత్తుగా లోపలినుంచి పట్టరాని సంతోషం వచ్చింది. చీకట్లోనుంచి పెద్దవెల్తురులో కొక్కసారి వచ్చినట్లు, గుడ్డివాడికి నేత్రావరోధము పోయి మళ్లిదృష్టివచ్చినట్లు, లక్ష్మికి తనకీ గల సంబంధము హఠాత్తుగా గోచరమైంది. ప్రేమ. తను లక్ష్మిని చిన్నప్పటినుంచి ప్రేమిస్తోనే ఉన్నాడు. అదోవింతకాదు. లక్ష్మికూడా తన్ని చిన్నప్పటినుంచి ప్రేమిస్తోంది. అది లక్ష్మిమాటల కర్థం. ఆకన్నీటి బిందువుల భావ మిది. తననూత్నభావములకు వ్యాఖ్యాన మిది. ఇది స్ఫురించిన కొంతసేపటివరకూ దీనివలన కలిగిన ఆనందానికి లోబడి పరవశుడై కొంతసేపున్నాడు. తరువాత ఆ ఆనందసమాధిలోనుంచి లేచి ముందుకర్తవ్య మాలోచించాడు. ఒకక్షణంలో అజ్ఞానావస్థలో ఉన్న బాలుడు యౌవనుడుగా మారిపోయాడు. ప్రేమస్వరూపం అంతా ఒక్కసారి కళ్లకు కట్టినట్టు కనుపించింది. లక్ష్మికి నాలుగైదు సంవత్సరముల క్రితమే వ్యక్తమైన సంగతి ఇప్పటికి తెలిసిం దతనికి.

ఈ ఆనందవార్ధిలో అవశుడై ఉండి, ప్రవాహ మెక్కడికి తీసుకువెడితే అక్కడికి వెళ్లడమా లేక ప్రవాహానికెదురీది తన ఇష్టం వచ్చినచోటికి వెళ్లడమా అని ఆలోచించాడు. ఏది ఎట్లున్నా ఇక్కడనుంచి వెళ్లిపోయి కొన్నాళ్లు మళ్లీ ఇక్కడకు రాకూడ దనుకున్నాడు. తను వెళ్లిపోయి కొన్నాళ్లు కనపడకుండాఉంటే లక్ష్మితన్ను మరిచిపోయి సుఖంగా ఉంటుందేమో అనుకున్నాడు. ఆమాత్రం అవకాశం లక్ష్మికి కలుగచెయ్యడమే న్యాయమనుకున్నాడు. లక్ష్మిమరచిపోవచ్చు. ఎందుకు మరచిపోదు. నిక్షేపమల్లే మొగుడున్నాడు. కావలసినంత డబ్బుంది. ఇల్లు; వాకిలి; సంసారము. మరచిపోతుందంటే ఆశ్చర్యమేముంది. కాలం గొప్పవైద్యుడు లాంటిది. అనేక మార్పులు కలిగిస్తుంది. కుదరవనుకున్న మనోవ్యథల ననేకాన్ని కుదురుస్తుంది. కాని తనకుమట్టుకు అటువంటి అదృష్టం పట్టదు. తనేమిచూచుకొని మరచిపోతాడు. తనబాధ యావజ్జీవం ఇలా అనుభవించవలసిందే, ఒకళ్లతోటి చెప్పుకోడా

నికి వీలులేదు. ఒకళ్లు తీర్చేదికాదు. అనుభవించక తప్పదనుకున్నాడు. ఈ నిశ్చయంతోటే ఇంటికెళ్లాడు. అప్పటికప్పుడే పెళ్లివారి అందరి భోజనాలూ అయినాయి. రాత్రి ఊరేగింపుకి బయల్దేరబోతున్నారు. వెంకట్రామయ్యకనబడి, "ఏమిరా, ప్రకాశం అన్నానికొచ్చావుగావు, ఇంత పొద్దోయేదాకా ఎక్కడికెళ్లావు" అన్నాడు. "గోదావరిగట్టున కూచున్నాను. నాకీపూట ఆకలి లేద"న్నాడు ప్రకాశం. "ఆకలి లేకపోవడమేమిటి; కొంచెముమజ్జిగోసుకు తిను. ఇవాళ ఆఖరురోజు, ఊరేగింపు కడదా," మన్నాడు. "నాకాకలిలేదు. ఊరేగింపుకి రాలేన"ని ఒకమూల పడుకున్నాడు, ప్రకాశం. వెంకట్రామయ్యని చూడడంతోటే తన సంకల్పం మరింత దృఢమయింది. మరునాడు మధ్యాహ్నం పెళ్లివారితోటే బయలుదేరి, ప్రకాశం, కాకినాడ చేరాడు.

౬

ప్రకాశం ఆసంవత్సరమే మెట్రిక్యులేషను ప్యాసయి, కలకత్తా చదువుకి వెళ్లాడు. శలవుల్లో ఇంటికొచ్చాడు. కాని రాజోలు మాత్రం వెళ్లేవాడు కాడు. అక్కడిసంగతులు తెలుస్తూనే ఉండేవి. వెంకట్రామయ్య సహవాస దోషంచేతను దుర్వ్యాపారమారంభించాడు. దగ్గరనున్న మానేపల్లిలో బోగందాని నొకదానిని చేరదీశాడు. దాని వలలోపడి ఇంటికి రావడమే మానుకున్నాడు. దానికి పెట్టేడబ్బు కింక మేరేలేదు. తల్లి కీసంగతి మొట్టమొదట తెలియలేదు. అస్తమానం చక్కనిబట్టలు వేసుకుని డబ్బు ఖర్చుపెడుతూ తిరుగుతోంటే, ఊరికే నలుగురులోనూ తిరగడం నేర్చుకున్నాడు గదా అని ఒక్కడే పిల్లవాడుగదా అని, ఏమడుగుతే అది ఇవ్వడం మొదలుపెట్టింది. తల్లికి క్రమేణా, ఈసంగతి తెలిశింది. "పోనీ చిన్నతనం కొంచెం జ్ఞానం వస్తే వాడే దార్లోకొస్తాడు, ఇప్పుడు గట్టిగా చివాట్లెడితే కోపమొచ్చి ఏమి ఆఘాయిత్యము చేస్తాడో" అని కొడుకు ఆటలు సాగించింది. వ్యవహారం ముదిరింది. తల్లి డబ్బివ్వకపోతే పెళ్ళాం మెళ్ళో వస్తువులు తీసుకోవలెనని ప్రయత్నంచేశాడు. తల్లి స్నేహితులు బంధువులు, ఎంతమంది ఎన్నిచెప్పినా వినక ఉంపుడుకత్తెను విడిచిపెడితే దాని గతేమి కానని అడిగాడు.

లక్ష్మి ఒకరోజున మొగుణ్ణి ఇంటిదగ్గర ఉండమని బ్రతిమాలింది. "లేకపోతే నేనెందులోనేనా పడిచస్తా"నంది "లోకంలో ఎంతమంది చావడంలేదు. అందులో నువ్వొకత్తెవ"న్నాడు.

ఇవన్నీ ప్రకాశానికి తెలిశి చాలా విచారించాడు. రత్నంలాంటి భార్యను విడిచిపెట్టి బోగందాని దగ్గర ఏమి సుఖం ఉందని, ఇల్లూ వొళ్లూ గుల్ల చేసుకుంటున్నాడు వెంకట్రామయ్యనుకున్నాడు. లక్ష్మి తనకంటె ఒకఏడాది చిన్నదైనా బాగుండేది. తనుపెళ్ళాడి సుఖపెడుదునుగదా అనుకున్నాడు. ఏమయినా రాజోలు మట్టుకు వెళ్లలేదు. వెంకట్రామయ్య పేర ఒక ఉత్తరం మాత్రం రాశాడు ఇది కానిపనని. లక్ష్మి అవస్థ ఇలావస్తుందని కలలోనేనా అనుకోలేదు. లక్ష్మి తన్నెప్పుడేనా తలు

చుకుంటుందేమో అనుకున్నాడు. లక్ష్మి ఎంత అవస్థపడుతోందో ఎంత విచారిస్తోందో అనుకున్నాడు.

ప్రకాశంమట్టుకు లక్ష్మిని మరచిపోలేదు. అనుదినం తలుచుకుంటూండేవాడు. ఇలా ఉండగా ప్రకాశానికి పెళ్ళయింది. లక్ష్మి పెళ్ళికి వస్తే బాగుండు ననుకున్నాడు. కాని రాలేదు. బంధువులంతావచ్చారు లక్ష్మితప్ప. రాలేదని చాలా నొచ్చుకున్నాడు.

కలకత్తాలో అయిదేళ్ళుండి ఎం. ఏ. పరీక్ష ప్యాసయి, ఇంటికొచ్చాడు. భార్య పెద్దమనిషైంది. కార్యం చేసుకున్నాడు. రాజమహేంద్రవరం కాలేజిలో ఉద్యోగమయింది. అక్కడ తనూ భార్యా ఎంతోముద్దుగా కాపురం చేస్తున్నారు. భార్యఅంటే అతి ప్రేమ. నెత్తిని పెట్టుకుని పూజించేవాడు. ఏవిధాన్నీ పెళ్ళాం మనసు నొవ్వకుండా మెలుగుతూండేవాడు; కాని లక్ష్మినిమట్టుకు మరచిపోలేదు. నాడు రమణమ్మ పెళ్ళినించి వచ్చి సుమారు ఆరుసంవత్సరము లైంది. నాటినుంచి నేటివరకూ ఒక్కసారేనా రాజోలు తొక్కిచూడలేదు. లక్ష్మిని కలుసుకోలేదు. ఎంతో విశ్వప్రయత్నంచేశి మనస్సు సమాధానపరచుకుని అక్కడికి వెళ్ళడం మానేశాడు.

వెంకట్రామయ్య అప్పులపాలయి శరీరమంతా పాడుచేసుకున్నాడు. చాలా జబ్బుపడి చావు తప్పి కన్ను లొట్టపోయిందన్నట్లు ఎలాగో బ్రతికి జీవచ్ఛవంవలె, ఎందుకూ అశక్తుడై ఉన్నాడు.

చామర్లకోటలో లక్ష్మి పెద్దన్నగారికి పేరికంపెనీలో పనయింది. అక్కడికోసారి చూడ్డానికొచ్చింది లక్ష్మి. ప్రకాశం పనుండి కాకినాడ వెడుతున్నాడు రాజమహేంద్రవరంనుంచి. చామర్లకోటలో లక్ష్మిఅన్నగారు కనబడి దిగుమని బలవంతపెట్టాడు. అప్పటికి లక్ష్మి అక్కడ ఉన్నట్లు ప్రకాశానికి తెలియదు. తీరా గుమ్మంఎక్కేటప్పుడు తెలిసింది. ఒక్కసారి గుండెకొట్టుకోడం మానేసినట్టుండి, మళ్ళీ దడదడకొట్టుకోడం మొదలెట్టింది. అప్పుడు వెనుదీయడానికి వీలులేకపోయింది. కానున్నది కాకమానదని ముందుకి నడిచాడు.

ప్రకాశరావు మునుపటికంటె లావై పచ్చబడ్డాడు. కళ్ళకి జోడూ కోటూ వేసుకుని వచ్చేటప్పటికి లక్ష్మి వాకట్లోనే కూచుంది. కాని ప్రకాశరావుని ఆనమాలు పట్టలేక ఎవరోపరాయివాళ్ళనుకుని లోపలికివెళ్ళింది.

లక్ష్మి మునుపటికంటె నల్లపడ్డది. తల చాలాంభాగం నెరిసింది. ముఖంకూడా ఎండగాడ్పు తగిలిన పుష్పంలాగ వాడిపోయింది. "లక్ష్మీ! పరుగెత్తకు, నన్నుమరిచిపోయావా ఏమిటి" అన్నాడు ప్రకాశం. అనేటప్పటికి ప్రకాశాన్ని వెనక్కి తిరిగి ఆనమాలుపట్టి, నిశ్చేష్టురాలైంది. కళ్ళమ్మట నీళ్ళుకమ్మాయి. తలవంచుకొని మాట్లాడలేకపోయింది. ఆమాటా ఈమాటా మాట్లాడి ప్రకాశంఆరాత్రే వెళ్ళిపోయాడు. నివురుగప్పిన నిప్పువలె, ఉన్న తనపూర్వప్రేమంతా ఒక్కసారి జ్వాలగా పైకొచ్చింది.

కాలం తననుకున్నట్టుగానే ఈప్రేమ నార్పలేక పోయింది.

మళ్లీ రెండుమూడుసార్లు లక్ష్మినికలుసుకోడం సంభవించింది. మాటలవల్లా చేష్టలవల్లా లక్ష్మితన్నేమీ మరచిపోలేదని తోచింది. దీనివల్ల తనకి మరింత బాధకలిగింది. ఒకపక్క తనభార్యయెడల తనకుగలఅవ్యాజప్రేమ; లక్ష్మియెడల తనకు చిన్నప్పటినుంచి ఎన్నివిధముల ప్రయత్నంచేశినా చల్లారనిప్రేమ ఒక

పక్క; అతన్నికలతపెట్టడం మొదలెట్టాయి. లక్ష్మిపొందుకోరుతే తన్నినమ్ముకున్న భార్య ఏమంటుంది. కాని ఈవింతేమిటి, నిజమైన ప్రేమ ఉంటే ఇంకొకరిమీద దృష్టిపోదంటారు పెద్దలు. అలాగైతే తనకి భార్యమీద ప్రేమలేదనా? అలాఅని అతనుఒప్పుకోడు. మళ్లీ ఆపెద్దలే దక్షిణనాయకత్వం ఉత్తమనాయక లక్షణంగా గ్రంథాల్లో వర్ణించారు. దోషమైతే అలా ఎందుకు వర్ణించాలి. ఇటువంటి తర్కంతోటి చాలాదూరం ఆలోచించాడు. భార్యమీద తనకు పరిపూర్ణమైన ప్రేమఉంది; కాని భార్య రాకముందునుంచి ఉంది గనుకః లక్ష్మిమీద కూడా ప్రేమ ఉంది. అందుచేత లక్ష్మికూడా కావాలని నిశ్చయం చేసుకున్నాడు.

౭

ఇలాఉండగా లక్ష్మి ఋతుశూల ఉందని పిఠాపురంలో దొరసాని చాలాసాధకురాలని అక్కడికి వైద్యాని కొచ్చింది. ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రిలో ఉంది. ఇంక రెండురోజులకు వెళ్లిపోతుందనగా ఒకనాడు మధ్యాహ్నము చూడ్డాని కొచ్చాడు ప్రకాశం. ఇద్దరూ కష్టంసుఖం, చాలాశేపు మాట్లాడుకున్నారు. ఇద్దరి మనస్సులలోను ఒక్కటేభావం పైకిరావడానికి కొట్టుకుంటోంది. ఒకళ్ల గుండెచప్పుడు ఒకళ్లకు వినబడుతోంది. ఇద్దరూకూడా పైకి చెప్పడానికి ఝడిశి అల్పసంభాషణతోటి కొంతసేపు కాలక్షేపం చేశారు.

ఆఖరికింక పట్టలేక, ప్రకాశం, లక్ష్మిచెయ్యిపట్టుకుని " లక్ష్మీ! నీతోటి ఒక్కమాట చెప్పవలెనని ఉంది. చాలాకాలం నుంచి అనుకుంటున్నాను-గాని అవకాశం చిక్కిందికాదు

చెప్పకుండా ఉందామని విధితోటి పంతంపట్టి ఇన్నాళ్లూ ఊరుకున్నాను, కాని నేనేఓడిపోయాను. నేను చిన్నప్పటినుంచీ నిన్ను ప్రేమిస్తున్నాను. కాని చాలకాలంవరకు ఆసంగతి తెలుసుకోలేక పోయాను. హఠాత్తుగా రవణమ్మ పెళ్లిలో తెలుసుకున్నాను. పైగా నువ్వుకూడా నన్ను ప్రేమిస్తోనట్లు గ్రహించాను. కాని కొంతకాలం నేను కనపడకపోతే నువ్వు మరచిపోతావేమో అనుకున్నాను. నువ్వు మరవలేదని నాకు తెలుసును. నీవు నాదగ్గర దాచనక్కరలేదు. నేనింక హృదయంలో బాధ దాచుకోలేక ఇప్పుడు చెపుతున్నాను. ఇప్పుడేనా నాహృదయం పూర్తిగా విప్పదలచుకోలేదు. అందులోని అగాధప్రేమ బ్రహ్మకుతప్ప మరొకరికి తెలియదు; కాని ఇదిమట్టుకు నిశ్చయముగా నమ్ము. అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యమీద నాకు ఎంతపూర్తిలయిన పవిత్రమైన ప్రేమ ఉందో అంతపవిత్రమైన ప్రేమ నీమీదా ఉంది. ఇది అసంభవమని కొందరికి తోచవచ్చును. ఇది కేవలము అనుభవైకవేద్యము. అందుచేత లక్ష్మీ! మనరోజులిలా వెళ్లవలసినదేనా! ఇంతకాలంనుంచి సజీవమై చిగిరించుచున్న ఆశాలతను తెంపవలసినదేనా లేక నిర్మూలముకూడా చెయ్యాలా?" అన్నాడు గుక్కతిప్పుకోకుండాను.

ఈప్రశ్నకు వచ్చే సమాధానముపైన తనజీవితమంతా ఆధారపడిఉన్నట్లు, యవనిక వలెనున్న అశ్రుబిందువుల చాటునుండి ప్రేమరసముట్టిపడు చూపుతో అతిత్వరితముగ వస్తున్న వేడినిట్టూర్పుచేత కదలుచున్న నాసికాపుటములతో, చలిస్తోన్న అధరముతో ప్రాణము అరచేతపెట్టుకుని లక్ష్మి పెదవుల వైపు తదేకదీక్షగా చూస్తూ ప్రకాశరావు అత్యాతురతతో కనిపెట్టుకున్నాడు.

లక్ష్మి తలవంచుకొని వేడినిట్టూర్పులు విడుస్తూ కన్నుల నీరుకారుస్తూ సాంతంగా వింది. మొహమంతా ఎర్రబడ్డది. వొళ్లంతా జ్వరంవచ్చినట్లు కాగడం మొదలెట్టింది. కొంతసేపూరుకుని, దీర్ఘనిశ్వాస మొకటి విడిచి, "ప్రకాశం నారహస్యం నువ్వు తెలుసుకున్నానన్నావు నిజమే ఆమాట; నేను దాచను. నీమీద ప్రేమున్నమాట నిజమే నాజీవితంలో నిన్ను ప్రేమించినట్లు నేనింకొకర్ని ప్రేమించలేదు. నా భర్తని నేను ప్రేమించానని నీతోటి చెపితే నన్ను నేనే మోసపుచ్చుకున్నట్లుంటుంది. ఆయనతోటి నేపడ్డపాట్లెన్ని అన్నీ కావు. నీవు నాకెక్కువగా కావలసినరోజుల్లో నువ్వుకూడా దూరమైపోయావు. దానితోటి నాబాధ మరింత ఎక్కువయింది. ఇప్పుడు ఆయనయినా నాకు ఏలోటూలేకుండా నన్ను నెత్తిని పెట్టుకుంటున్నారు. పాపం నేను లేనిదే ఒక్కక్షణం ఆయనకు గడవదు. ఆయన జబ్బులో ఆయుస్ని అరిచేతిలోపెట్టుకుని చేసిన చాకిరీ ఇంతా అంతా కాదు. ప్రేమలేకపోతే ఇంత ఎందుకుచేశావంటావేమో. యావజ్జీవము మేము కలిసిఉండవలసినటువంటి వాళ్లము. చిన్నప్పటినుంచి ఒకచోట పెరగడంవల్ల మాకొకవిధమైన స్నేహం ఏర్పడ్డది. స్నేహభావం తప్ప మరొకటిలేదు. అదికాకుండా, తన్ని నమ్ముకున్నవాళ్లని, అందులోభర్తని,

అతనెంతదుర్మార్గుడైనా కష్టంలో ఉన్నప్పుడు ఆడది విడిచిపెట్టలేదు. నాకు ఆయనతప్ప ఇంకోదిక్కులేదు. నాకు సగంకాలం గడిచింది. వార్ధక్యచిహ్నములు కూడా కనిపిస్తున్నాయి. నువ్విప్పుడు వేసిన ప్రశ్న అయిదారుసంవత్సరముల క్రితమే అడిగిఉంటే, మారుమాటలేకుండా, లోకానికేనా వెరవకుండా నీతో కూడా భూవలయాంతంవరకు వచ్చేదాన్నే. ఇప్పుడు కాలాతీతం అయిపోయింది. ముందు వెనుకలాలోచించే రోజులొచ్చాయి. నీమీద ప్రేమ తగ్గిందని చెప్పడంలేదుసుమా. అంతికంతకు వృద్ధిలోఉందికాని క్షయంలోలేదు ఆ ప్రేమ. నీకు రత్నంలాంటి భార్య ఉంది. ముందుముందు పిల్లలుకూడా పుడతారు. అటువంటిసమయంలో ఇంకోదాని మెడక తగిలించుకోడం మంచిదికాదు. నీపురోభివృద్ధికి భంగం వస్తుంది. ఉండు, నామాట కడ్డురాకు. నీకు నీభార్యమీద ఎంత ప్రేమఉందో, నామీదా అంతప్రేమ ఉందన్నావు కావచ్చును. మొగాళ్లల్లో అలా ఉంటుందేమోకాని, స్త్రీకమట్టుకు అలాకాదు. ఆడది ఎప్పుడూ తనహృదయాన్ని అలాపంచలేదు. అంతేకాకుండా తనప్రియుడు లేశమైనా ఇంకొకరిపై ప్రేమ చూపిస్తున్నాడంటే ఆడది సహించలేదు. నిన్ను వదలుకోడం చాలాకష్టంగానే ఉంది నాకు. ఇంతబాధపడుతూకూడా నీమేలుకోరి నిన్ను చేతులారా విడిచిపెట్టుకున్నానంటె, దాన్నిపట్టి నాప్రేమయొక్కపరిమితి తెలుసుకో. ఆఖరుసంగతింకొకటి, శరీరం ఎప్పుడూ ఒకమోస్తరుగా ఉండదు. ఈ వేళున్నపటుత్వం సౌందర్యం రేపుండదు. మకరందం పోవడంతోనే మళ్ళీ పుష్పం దగ్గిరకి తుమ్మెద రాదు. మకరందం ఉంది అంటే పూవుకొంచెమువాడినా, మధుపం ఝుంకారంచేస్తూచుట్టూతిరుగుతూనేఉంటుంది. అలాగే మన ప్రేమ పుష్పంకూడా అనాఘ్రాతమైతే, మనప్రేమ ఎక్కువ శాశ్వతంగా ఉంటుంది. అదిగాక శరీరాన్ని కోరకుండా ఉండే ప్రేమే సరియైనప్రేమ. నీవు మరోలాగ అనుకోకు. నాబాధను మన్నించి ఇంకెప్పుడూ ఇది తలపెట్టకు. కాని నన్నుమట్టుకు మరచిపోకు," అని హృదయవేదనంతా ఒక్కసారి బాష్పరూపకంగా వెడలగ్రక్కింది.

ప్రకాశానికి కూడా కళ్ళమ్మట నీళ్లు వచ్చాయి. ఒక్కమాటు నిశ్చేష్టుడై, ఊరుకున్నాడు. ఆఖరికనాడు తలవంచుకొని, "లక్ష్మీ! ఈ మోస్తరు జవాబు వస్తుందని నేను స్వప్నంలోకూడా అనుకోలేదు. నీవుచెప్పినదే బాగుంది. నన్ను ప్రేమించానికి నాకళ్లు తెరిచావు. నీపై ప్రేమాగౌరవమూ నాకు ఇప్పుడు వేయిరెట్లెక్కువయింది. నిన్ను ఎన్నటికీ మరవడం అసంభవము. నాహృదయపద్మంలో ఎప్పుడూ నిన్ను నిలిపి, నిష్కామమైన ప్రేమ పుష్పములతో నిన్నెప్పుడూ ఆరాధిస్తాను. నిన్నింత కలతపెట్టినందుకు క్షమించి నాకు శెలవియ్యి నేవెడతాను" అని తలఎత్తుకుని, వెనక్కితిరిగిచూడకుండా, దృఢమైన నడకతో వెళ్లిపోయాడు ప్రకాశరావు.

అతను దృష్టిపథంలోనుంచి వెళ్ళగానే, అతనివైపు చేతులుజాపి, ఒక్కసారి తనల్లోనే పెద్ద రాగాలెట్టింది లక్ష్మి. కొంత సేపటికి

శాంతించి, కళ్లుతుడుచుకుని, చెదరిన వెంట్రుకలు సవరించుకుని కూచుంది. సూర్యుడస్తమిస్తోన్నాడు. ఆకాశమంతా వర్ణనాతీతమైన వర్ణములతో చిత్రింపబడి ఉంది. ఆ కాంతికొంత లక్ష్మిగదిలో కొచ్చి, ఆవిడ మొగము మీద పడి, ఒకవింత శోభను తెచ్చింది. నెరసిన తెల్లనితల, సువర్ణచ్ఛాయను పొందింది. కన్నులలో చెప్పనలవి కాని ప్రశాంతం నిలచిఉంది. తనసంరక్షణకోస మొచ్చిన వదినగారు అప్పుడే గదిలోకివచ్చి అట్టునిలబడిపోయి, అంత చక్కదనం శాంతం ఎప్పుడూ ఎక్కడా చూడలేదని ఇప్పటికీ చెపుతూంటుంది.

పూర్ణిమ

తావధాని వేదుల సత్యనారాయణ శాస్త్రిగారు [సాహితీసమితి]

ఆ యుదయాద్రినుండి యరుణారుణమౌ ముఖమెత్తి, గాఢల
జ్జాయుతమూ నవోఢవలె, సందడిసేయక తొంగితొంగి లో
లాయతదృక్కులన్ దశదిశాంతరముల్ పరికించి, జీర్ణమై
పోయిన నా కుటీరపదమున్ గుఱుతించుకుని చాటుచాటుగన్.

ఈవలిగాడ్పులెంత వడకించుచున్నను, నీప్రవాళ రా
ఖావిలసన్ముఖంబు దడిగట్టెడు సిగ్గున సంచలించినన్
మోవఁగరానిప్రేమను విముక్తగవాక్షపథంబునుండి, నా
క్రేవకు వత్తువెల్గొ పులకింపగ నాతృణకీర్ణశయ్యయున్

పొంగులుదేరు తీయవలపుల్ హృదయంబును ముట్టడింపఁగా
వంగి, సుషుప్తిచే ముడుపువాఱిన నాకనుబొమ్మలన్ సుధా
లింగితచుంబనంబుల చలింపఁగఁ జేసి సుఖోదయవ్యథా
భంగములన్ గలంతువు భవన్మృదులోచ్ఛ్వసితానిలాహతిన్

ఆనునుమబ్బుకౌఁగిళుల కందని నీలవలీ మనోజ్ఞమా
మేని సుధాద్యుతుల్ నిదుర మేల్కొలుపన్ నవమాఘమాసనం
ధ్యానిలమట్లు నా తనులతన్ పులకింపులతో స్పృశింప, బా
ధానిశితంబు నాపుపుడెదన్, గడియింతువు నీమొసందతో

ఈతృణశయ్యయందె నిదురించెద మిద్వరమున్ పరస్పరా
ద్వైతగతాత్మవృత్తిని, భవద్భుజవల్లుల నన్నుబందెగన్
జేతువునీవు, నేనపుడు నీయమృతాసవమెల్లఁ ద్రావుచున్
రాతిరి నొక్కస్వప్నమధురక్షణ మట్టుల నెల్లఁబుచ్చెదన్.